మాట నిలబెట్టుకున్న సీఎం జగనన్న


కొండాపురం : మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


వల్లూరు : మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


తొండూరులో మహిళలకు చెక్కును అందిస్తున్న వైఎస్ మధురెడ్డి

కొండాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడంతోపాటు సున్నావడ్డీ చెల్లిస్తున్నారు. ఇచ్చిన మాట నెరవేర్చారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రాఘవేంద్ర ఆశ్రమంలో డ్వాక్రా మహిళతో వైఎస్సార్ ఆసరా మూడో విడత సభ నిర్వహించి మాట్లాడారు. క్రమం తప్పకుండా మూడో విడత డబ్బులు చెల్లిస్తున్నారన్నారు. కొండాపురం మండలంలో 397 స్వయం సహాయ సంఘాలకు మెగా చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ ఎద్దు భారతి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు చింతరాజారెడ్డి, నవజ్యోతిరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కొండు రామిరెడ్డి, బుజ్జి, సాయి, వినోద్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎం ఓబులేసు, తహసీల్దార్ శోభన్‌బాబు, పెద్దిరెడ్డి, శేఖ ర్ తదితరులు పాల్గొన్నారు

ప్రతి మహిళను లక్షధికారిని చేయడమే ధ్యేయం

వల్లూరు : రాష్ట్రంలోని ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం అని ఎమ్మె ల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో బుధవారం జరిగిన వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఇదే బడ్జెట్ వున్నప్పటికీ కమీషన్ల కోసం పని చేసి రాష్ట్రాన్ని దోచుకున్నారని, ప్రస్తుతం సీఎం అదే బడ్జెట్‌తో అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్ర జలకు చేదోడుగా మారారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగన్‌కు అండగా నిలవాల్సిన అవసరం వుందన్నారు. అనంతరం మండలంలోని 560 సంఘాల్లోని 5616 మంది మహిళలకు సంబంధించి రూ.5 కోట్ల 37 వేల 174 రూపాలయ విలువ చేసే మెగా చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. తహసీల్దార్ అమరేశ్వరి, ఏసీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎం శైలజ, ఎంపీడీఓ రఘు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ బల్సిరెడ్డి వీ రారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, పార్టీ నేత లు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, కిషోర్‌కుమార్, స ర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రెడ్డి, కుళాయప్ప, ఎంపీటీసీలు గంగయ్య, రామకృష్ణారెడ్డి, సుబ్బరాయు డు, నేతలు హరి కేశవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ప్రతాప్‌రె డ్డి, నాగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా మహిళలకు వరం

పులివెందుల రూరల్ : వైఎస్సార్ ఆసరా మహిళలకు వరం లాంటిదని ఎంపీపీ వరలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డిలు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో వైఎస్సార్ ఆసరా పథకం వారోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని 230 డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.1,97,71,800ల మెగా చెక్కును వారు డ్వాక్రా మహిళలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు మూడు విడతలలో 75 శాతం డ్వాక్రా రుణమాఫీ చేశారన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్, ఎంపీటీసీ భాందవి, సర్పంచ్‌లు ప్రసాద్, మానిక, మండల స్పెషలాఫీసర్ ఆశోక్‌రెడ్డి, ఏపీఎం గురురాణి, సీసీ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటి బిడ్డలా జగనన్నను ఆశీర్వదించండి

వ్రతాయపేట : సుదీర్ఘ పాదయాత్ర సమయంలో మీ కష్టాలను కళ్లారా చూసి అక్క చెల్లె మ్మలకు అవ్వాతాతలకు హామీ ఇచ్చి ఆమేరకు కట్టు బడి అండగా నిలిచిన జగనన్నను మీ ఇంటి బిడ్డలా మరొక్కమారు ఆశీర్వదించాలని వైఎస్ఆర్‌సీపీ నేతలు కోరారు. వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత చెక్కు పంపిణీ బుధవారం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మండలంలోని 473 డ్వాక్రా గ్రూపులకు మంజూరైన రూ. 3,09,3,688 మెగా చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, తహసీల్దారు రాజశింహ నరేంద్ర, ఎంపీడీఓ శివారెడ్డి, ఏపీజీబీ మేనేజరు అశోక్, ఈవోపీఆర్డీ గంగులయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సర్పంచ్‌లు హర్షాద్, నరసింహులు, ఎంపీటీసీలు శాంతమ్మ, మోహన్‌రెడ్డి, పీఎం గంగార్జున, పార్టీ నేతలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వరం వైఎస్సార్ ఆసరా

తొండూరు : డ్వాక్రా సంఘాలలో ఉన్న మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం గొప్ప వరమని వైఎస్సార్ సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపా రు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడవ విడత పథక చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 403 డ్వాక్రా సంఘాలకు రూ.3.52కోట్లు మంజూరైందని ఏపీఎం శివనారాయణ తెలిపారు. కార్యక్రమంలో శాప్ రాష్ట్ర డైరెక్టర్ భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, శీతల గిడ్డంగుల రాష్ట్ర డైరెక్టర్ సురేష్‌రెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, ఎంపీటీసీ విజయ్‌శంకర్, మాజీ ఎంపీటీసీ శివశంకర్‌రెడ్డి, ఎంపీడీఓ నీలకంఠారెడ్డి, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చెన్నూరు : శ్రీరామనవమి పండుగ జెండా ఉత్సవం సందర్భంగా గురువారం మధ్యాహ్నం 3 గంటలనుంచి రాత్రి 8 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

అంబాభవానికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

జమ్మలమడుగు : పట్టణంలోని భావసార క్షత్రియుల ఇలవేల్పు అయిన అంబాభవాని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైత్ర మాసం అష్టమి రోజున అమ్మవారి జన్మదినం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలను పండితులు కల్యాణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక

జమ్మలమడుగు రూరల్ : స్థానిక న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరీగా కె.వి. మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముని సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీగా రామ్మోహన్, ట్రెజరర్‌గా లక్ష్మీ మహేశ్వరరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామ దేవతలకు బిందె సేవ


బిందె సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన ఏరువాక గంగమ్మతల్లి ఆవులపల్ల్యం(గంగజాతర) మహోత్సవం మొదటి రోజు సందర్భంగా బుధవారం పట్టణంలోని గ్రామ దేవతలకు బిందే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఇంటి వద్ద నుంచి బిందె నీళ్ల తీసుకుని వచ్చిన బిందెసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యే నివాళి

చెన్నూరు : శివాలపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ముమ్మడి నారాయణరెడ్డి మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మృతుడి స్వగృహానికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌పీఎస్ఆర్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్, ఎంపీటీసీ ముదిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

ముద్దనూరు : శ్రీరామనవమి సందర్భంగా గురువారం స్థానిక రామాలయంలో సీతారామ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నేటి ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, కల్యాణం, అన్నదాన, రాత్రి గ్రామోత్సవం కార్యక్రమాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లింగాల : మండలంలో గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు రామాలయాలు ముస్తాబయ్యాయి. ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

చింతకొమ్మదిన్నె : గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పన తెలిపారు. బుధవారం ఆమె సీకేదిన్నెలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు చిరు ధాన్యాలు, ఆకు కూరలు తీసుకోవాలన్నారు. కిశోర బాలికలకు వ్యక్తి పరిశుభ్రతపై, ఐరన్ టాబ్లెట్స్ గురించి వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ ప్రత్యూష, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దముడియం : పౌష్టికాహారంతో తల్లీ, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ రాజేశ్వరీదేవి తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని అంగన్‌వాడీ–4 కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు, వంటకాలను ప్రదర్శించారు. అలాగే ధాన్యాలు, చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి సీడీపీఓ వివరించారు. మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని అందంగా తీర్చిదిద్దుకుందాం


ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు

జమ్మలమడుగు : నగర పంచాయతీని ప్రజలు, అధికారులందరూ కలిసి అందంగా తీర్చిదిద్దుకుందాం అని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ కోరారు. బుధవారం స్వచ్ఛ మహోత్సవ్-2023లో భాగంగా మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రజలు ఇంట్లో ఉన్న చెత్తను మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తతోపాటు పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్‌ను వేరు చేసి అందించాలన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను స్వచ్ఛందంగా నిషేధించాలన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ స్వచ్ఛభారత్‌లో అవార్డు సాధించిందన్నారు. రాబోయే రోజుల్లో పట్టణాన్ని అందంగా తయారు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి నూర్ బాషా, కౌన్సిలర్ పోచిరెడ్డి, మెప్మా సీఓ రసూలమ్మ , సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి

ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

కొండాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం గండ్లూరు సచివాలయం పరిధిలోని చౌటిపల్లె పునరావాస కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వివరాలను వారికి వివరిస్తూ బుక్‌లెట్‌ను వారికి అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులకు బోర్లు వేయడానికి ఎస్టిమేట్ తయారు చేసి వెంటనే మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే త్వరలోనే ముంపువరహారం అందజేస్తామన్నారు. కాలనీలోని షేక్ ఖాజాబి అనే దివ్యాంగురాలుకు రూ.5 వేలు ఆర్థికసాయం ఎమ్మెల్యే చేశారు. కార్యక్రమంలో చింతరాజారెడ్డి, వై.రామసుబ్బారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెల్లాల కృష్ణరెడ్డి, చింతనవజ్యోత్‌రెడ్డి, పెద్దిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, పి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థినులకు విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వేంపల్లె : ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించాలని తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి కోరారు. బుధవారం స్థానిక సాంఘిక వసతి గృహంలో ఉన్న విద్యార్థినులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వేంపల్లె మండల శాఖ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ బీసీ హాస్టల్ విద్యార్థినులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత, గుర్తింపు సాధించాలన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, మానవత సంస్థ డైరెక్టర్ రంగయ్య, మానవత సహాయ చైర్మన్ రవిశంకర్‌గౌడ్, మానవత సంస్థ అధ్యక్షుడు కృష్ణతేజ, అలిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, మానవత సంస్థ ప్రతినిధులు, హాస్టల్ వార్డెన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు


పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీని గ్రేటర్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు శ్రమించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌కు ప్రజల కోరిక మేరకే వైఎస్సార్ కూరగాయల మార్కెట్ అనే పేరుకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల అభివృద్ధిలో భాగంగా రింగ్‌రోడ్డు చుట్టూ భూములు కోల్పోయిన కొంతమంది యజమానులకు ఇప్పటికే డబ్బులు ఇవ్వడం జరిగిందన్నారు. రింగ్‌రోడ్డు చుట్టూ సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. త్వరలోనే పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే మోడల్ టౌన్‌లో భాగంగా పట్టణంలో రోడ్ల విస్తీర్ణం కొరకు ఇళ్లను కోల్పోయిన వారికి వారి ఖాతాలో డబ్బులు జమచేస్తామన్నారు. ప్రజల సహకారంతో సుందరీకరణంగా పులివెందులను తీర్చిదిద్దుతామన్నారు. అలాగే ఇంటి పన్నులు చెల్లించని వారు ఈనెల 31వ తేదీలోపు చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో ఏవార్డులో కూడా చెత్త కనిపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు మున్సిపల్ కౌన్సిలర్లు కూడా తమ వార్డుల్లో పర్యటించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అందుకు అధికారులు కూడా వెంటనే స్పందించాలన్నారు. వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన రైతులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న సీఎస్‌ఏ కో ఆర్డినేటర్ ఆదినారాయణ

వేంపల్లె : మండల పరిధిలోని టి.వెలమవారిపల్లె గ్రామంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన 5 రకాల పండ్ల మొక్కలు, కాకర, టమోట, కంది తదితర పంటలను బుధవారం పాండిచ్చేరి అరబిందో ఫౌండేషన్‌కు చెందిన రైతులు పరిశీలించారు. అలాగే కుప్పాలపల్లె గ్రామంలో రైతు నమరసింహారెడ్డి సాగు చేసిన కల్పతరువు పద్ధతులను గుర్తించి ఆదాయం, వ్యయం, కషాయాల తయారీ గురించి సీఎస్‌ఏ కో ఆర్డినేటర్ ఆదినారాయణ అవగాహన కల్పించారు. కిసాన్ మిత్ర ద్వారా ఆత్మహత్య చేసుకున్న రైతు ఆనందరెడ్డి కుటుంబానికి రూ.5ల క్షల ఆర్థిక పరిహారం అందించారు. రైతులకు కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై అవగాహన


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : విపత్తుల సమయంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేస్తున్నాయని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డిలు తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) కమాండర్ శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విపత్తు నివారణపై అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా పూర్తి నష్టాలను నివారించవచ్చునన్నారు. ఎంఈఓ బండి వీరారెడ్డి, హెచ్ఎం విజయకుమారి, ఆర్ఐ లోకేష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మధు, ఎన్‌డీఆర్ఎఫ్ బృంద సభ్యులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి ఎస్.కవిత

వల్లూరు : విద్యార్థినుల విద్య, ఆరోగ్య విషయాల పట్ల అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.కవిత సూచించారు. వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించి వంట శాలను, వసతి గదులను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కొరకు అందుబాటులో వున్న స్నేహ పూర్వక న్యాయ సేవా పథకం -2015 గురించి వివరించారు. సమస్యలు వుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకువచ్చి న్యాయం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లిల్లెమ్మ, ప్రిన్సిపాల్ నసీమున్నీసా, ఏఎస్ఐ మోహన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం ఆమె వల్లూరులోని కృప ఓల్డ్ ఏజ్ హోంను సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


మందులు పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

వేంపల్లె : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుళరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా బుధవారం స్థానిక వేంపల్లె దళితవాడలో జరుగుతున్న ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరంలో తాళ్లపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వచ్చి వృద్ధులకు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు, పీడీ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి గ్రస్తులకు పోషకాహారం పంపిణీ


క్షయవ్యాధి గ్రస్తులకు పోషకాహారాన్ని అందజేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

జమ్మలమడుగు రూరల్ : ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ కేంద్రం విభాగం వారు క్షయవ్యాధి గ్రస్తులకు పోషకాహారంను పంపిణీ చేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి సొంత నిధులతో నాగలకట్ట వీధిలో ఉన్న క్షయవ్యాధి గ్రస్తులకు గోదుమపిండి, బెల్లం, రాగిపిండి, వేరుశనగలు, ఖర్జూరాలు ఆయిల్ పాకెట్, పెసులు, ఉప్మారవ్వ తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో టి.బి. ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నిషియన్ రామచంద్ర, ఆశా వర్కర్లు ఉషారాణి సిబ్బంది, మేరీ రోస్లిన్, సునీల తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : క్షయవ్యాధి మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల త్వరగా కొలుకోవచ్చునని టీబీ ఆరోగ్య పర్యవేక్షకుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని క్షయవ్యాధి గ్రస్తులుగా నమోదు చేసుకున్న వారి వివరాలతో ఇంటింటికీ వెళ్లి పౌష్టికాహారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ సునీల, రామచంద్ర, మేరి రోస్లిన్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కొలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రామ్ ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : భారతీయ జనతా పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలానికి చెందిన ఏనుగుమండి రామ్‌ప్రసాద్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించినట్లు ఉత్తర్వులు అందాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు నుంచి తనను కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు ఉత్తర్వులు అందాయని బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

వల్లూరు : మండలంలోని గణేష్‌పురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నేత మీగడ నారాయణరెడ్డి కుమారుడు నాగేంద్రారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల చికిత్స పొందాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం వారి గృహానికి వెళ్లి నాగేంద్రారెడ్డిని పరామర్శించారు. సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, స్థానిక వైఎస్ఆర్‌సీపీ నేత బాలిరెడ్డి పాల్గొన్నారు.

విరాళం అందజేత


విరాళాన్ని గ్రామస్తులకు అందజేస్తున్న జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే బండలాగుడు పోటీలకు బుధవారం మొదటి బహుమతి విరాళాన్ని సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి రూ.50 వేలును గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు కోకటం విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కమలాపురం : మండలంలోని టి.చదిపిరాళ్ల దళితవాడలో నూతనంగా నిర్మించిన శ్రీరాముల వారి గుడిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి పాల్గొన్నారు. ఈ ఆలయానికి నరేన్ రూ.60 వేలు వితరణ చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా ఆలయానికి నూతనంగా ఏర్పాటు చేసిన కటాంజనంను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, వైఎస్సార్ సీపీ మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సమాజ సేవకు పాటుపడాలి

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : విద్యార్థులు బాగా చదువుకుని సమాజ సేవకు పాటుపడాలని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు మాధవ గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మైలవరం మండలం వేపరాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమాజంలో సంస్థ నిర్వహిస్తున్న సేవల గురించి వివరించారు. అనంతరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఫణీంద్ర, ప్రవీణ, గణేష్‌లకు రూ.1000, రూ.750, రూ.500 నగదు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సెక్రటరీ మస్తాన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు


నగదు బహుమతిని విజేతలకు అందిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని సి.రాజుపాళెంలో వెలసిన శ్రీకోదండరామస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా జరిగాయి. బుధవా రం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ కాటగిరి బండలాగుడు పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 జతల ఎద్దుల బండలాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలను గ్రామ నాయకులు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, అంకిరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ. 60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు అందజేశారు.

పన్నుల గడువును పెంచాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పన్నుల గడువును పెంచాలని రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లీమ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఇంటి, నీటి, వివిధ రకాల పన్నులను అపరాధ రుసుం లేకుండా చెల్లించమనడం అభినందనీయమన్నారు. నెల రోజులు గడువు పెంచడం ద్వారా చిన్న చిన్న ఉద్యోగులు, వ్యాపారులు చెల్లించడానికి వెసులుబాటు ఉంటుందన్నారు.